క్లుప్తంగా

ఫార్మసీ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

కర్నూలు(హాస్పిటల్): ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఏపీపీఎస్సీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫార్మాసిస్ట్, పాలిటెక్నిక్ లెక్చరర్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి ఫార్మసీ గ్రాడ్యుయేట్లు విజయవాడలో వినతి పత్రం సమర్పించారు. విషయమై పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఫార్మసీ గ్రాడ్యుయేట్లు తెలిపారు.

ముస్లింలపై బాబుది సవతితల్లి ప్రేమ

కర్నూలు(సెంట్రల్): తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముస్లింలపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంఏ అమీద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని మీడియా రూంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మహానాడు వేదికగా చంద్రబాబునాయుడు అన్ని వర్గాలకు తాయిళాలు ప్రకటించి ముస్లింలను విస్మరించారన్నారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ అజీజ్‌ఖాన్, మాబు, భాయ్, అన్వర్, ఫిరోజ్‌ఖాన్, వలి, షేక్షావలి పాల్గొన్నారు.

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నేడు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని మునగాల పాడు పంపు హౌస్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజలు కలిసి ప్రారంభించనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులు ఎదు ర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వి.గిరికుమార్‌రెడ్డి, కృష్ణ డిమాండ్‌చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఒక్కరోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రూపాల్లో 83 రోజులుగా ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుత నిరసన కార్యక్రమాలు చేదుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి ఇ బ్బంది లేకుండా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం స్పందించే తీరు ను బట్టి సమ్మెకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

పవన్ భాష చూస్తే టీడీపీతో ఉన్నట్లు తెలుస్తుంది

కర్నూలు కల్చరల్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ భాష చూస్తే టీడీపీతో కలిసి ఉన్నట్లు తెలుస్తుందని బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరిస్తే అభివృద్ధితోపాటు అద్భుతాలు జరుగుతాయన్నారు. టీడీపీ పోటీ పడి మేనిఫెస్టో ఇస్తుందని, అయితే సంపదను సృష్టించి మేనిఫెస్టో అమలు చేస్తే బాగుంటుందన్నారు.

తైక్వాండోలో చిన్నారులు రాణించాలి

కర్నూలు (రూరల్): తైక్వాండో క్రీడలో చిన్నారులు రాణించాలని అవోపా రాష్ట్ర చైర్మన్ యుగంధర్ శెట్టి సూచించారు. నగరంలోని పెద్ద మార్కెట్ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. తైక్వాండో క్రీడ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరూ వేసవి సెలవును సద్వినియోగం చేసుకునేందుకు ఏదో ఒక క్రీడలో భాగస్వాములు కావాలన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్,మెన్ టూ, ది లిటిల్ మర్మయిడ్, ఫాస్ట్ ఎక్స్, 2018, ది కేరళ స్టోరీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్ , మెన్ టూ , 2018, విరుపాక్ష, ఏలియన్స్ 2042, అన్నీ మంచి శకునములే , ఫాస్ట్ ఎక్స్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, మేమ్ ఫేమస్, మళ్లీ పెళ్లి , మెన్ టూ, 2018
, ది కేరళ స్టోరీ, గ్రే : ది స్పై హూ లవ్డ్ మీ
భరత్ కాంప్లెక్స్ : ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, విరుపాక్ష
శ్రీరామ : విరుపాక్ష
రాజ్ : మళ్లీ పెళ్లి
విజయ: బిచ్చగాడు 2

సంక్షేమ సారథి సీఎం జగన్



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు

- పేదల బతుకులు మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇచ్చిన హామీలు నెరవేర్చడం ఆయనకే సాధ్యం
- కర్నూ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదల సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలు చూసిన జగనన్న వాటిని తొలగించేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వాటితో పేదల బతుకుల్లో మార్పులు వచ్చాయన్నారు. నవరత్నాల పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడం వైఎస్‌ఆర్ కుటుంబానికే సాధ్యమవుతుందని, నాడు మహానేత వైఎస్‌ఆర్ పాదయాత్ర చేసిన ఇచ్చిన హామీలతో పాటు చెప్పనివి కూడా అమలు చేసి చరిత్ర సృష్టించారని, నేడు సీఎం జగన్ కూడా పాదయాత్రలో చెప్పిన వాటితో పాటు చెప్పనివి కూడా ఆచరణలో పెట్టారని గుర్తు చేశారు. పాలనలో గొప్ప మార్పులు తెచ్చి గొప్ప సంస్కరణ కర్తగా పేరు పొందారని, ప్రజల ఇంటి వద్దకే చేర్చేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, లక్షల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగ సమస్యను రూపుమాపారన్నారు. ఏ పథకం వివరాలు కావాలన్నా, దరఖాస్తు చేయాలన్నా, పంఛన్ పంపిణీ చేయాలన్నా వలంటీర్లే ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్కారు బడుల్లో పేదలు తినే తిండి నాణ్యతతో ఉండాలని జగనన్న గోరుముద్ద పథకాన్ని తెచ్చారని, నాడు- నేడు పథకాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ పథశాలతో పాటు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. దీంతో విద్యా సంస్థలు, ఆసుపత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. పేదలపై వైద్య భారం ఉండరాదని వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీని పటిష్ఠం చేసి ఎన్నో రోగాలకు ఉచిత వైద్య సదుపాయం కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో సారి భారీ విజయం వైఎస్‌ఆర్‌సీకి వరించనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు నారాయణమ్మ, నాయకులు మద్దయ్య, ఆది మోహన్‌రెడ్డి, ప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జగనన్నది ప్రజారంజక పాలన

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య



కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది ప్రజారంజక పాలన అని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కల్లూరు అర్బన్ 30వ వార్డులోని శరీన్‌నగర్‌లో ఉన్న దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలనింటినీ అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫేస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి హామీలను తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన సమయంలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేస్తూ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉందని, ఎలా పాలన చేస్తాడని హేలన చేసిన ప్రతిపక్ష పార్టీల నాయకుల అంచనాలకు మించి, దూరదృష్టి, విజన్‌తో రాష్ట్ర దిశను మార్చిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్యావైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ వినూత్న పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపుతున్న తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు జమచేస్తున్నారన్నారు. మన బడి నాడు–నేడు పథకం కింద పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. జగనన్న వసతి దీవెన, విద్యా దివేన పథకాలు, జగనన్న గోరుముద్ద పథకంతో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. పేదలందరికి ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో వైద్య సేవలను పల్లె ముంగిటకే తీసుకెళ్లినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి నాంది పలుకుతాయన్నారు. కులాలు, మతాలకు, పార్టీలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పేదరికం నుంచి కుటుంబాలను ఆర్థిక వృద్ధిలోకి తీసుకురావాలనే ధ్యేయంతో పాలన సాగుతోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, జయరాము, చిట్టెమ్మ, శ్వేతారెడ్డి, అరుణ, లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు యూనూస్, పెద్ద ఈశ్వరయ్య, ఉలిందకొండ రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, పర్ల సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో వెలుగు నింపిన జగన్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదల బతుకుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన 3 వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట, మొగల్‌పుర వీధి తదిరత ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు ఒకటో తేదీనే పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన గోరుముద్దలు పెడుతున్నారని, కార్పొరేట్ పాఠశాల్చకు దీటుగా విద్యా బోధన, ఇంగ్లీష్ మీడియం, కార్పొరేట్ వైద్యం, చేయూత, ఆసరా, వాహన మిత్ర, జగనన్న కాలనీల ద్వారా పక్కా గృహాలు, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ వంటి ఎన్నో పథకాలు అమలను జగనన్న అమలు చేశారన్నారు. సంక్షేమ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి నాలుగేళ్లు పూర్తి చేసుకుందని, ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ప్రజల సమస్యలు విని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్విన్, నాయకులు ఖాదర్ బాషా, మద్దయ్య, ఖుద్దూస్, చాంద్ బాషా, ముజాహిద్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి



మాటాలట్లడుతున్న సంఘం నాయకులు ఈశ్వరయ్య

కర్నూలు(రూరల్): తపాలా ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల(పోస్ట్‌మెన్, ఎంటీఎస్) సంఘం నాయకులు ఈశ్వరయ్య, శమంతక రెడ్డి కోరారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో తపాలా శాఖ ఉద్యోగులు నిర్వహిస్తున్న రాష్ట్ర ద్వై వార్షిక మహాసభల మూడో రోజు కొనసాగాయి. తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు మెహంత్, ఉద్యోగులు లక్ష్మీకాంత్, నన్నెబ, గిరిబాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'జన్‌భాగిదారి'

కర్నూలు(సిటీ): నిపున్ భారత్ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జన్ బాగిదారి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భా గంగా ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి పిల్లలు పాఠశాల స్థాయిలో 7 రకాల కార్యక్రమాల్లో పాల్గొనాలని, మంచి నైపుణ్యాలు కనపరచిన పిల్లలను, వారి తల్లిదండ్రులను మండలస్థాయి కార్యక్రమానికి, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మండల విద్యాధికారులు వారి పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం సీఆర్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.15,000 చొప్పున గరిష్ఠంగా ఐదు ఎకరాలకు రూ.75,000 ఇవ్వాలని, నకిలీ విత్తనాలను, ఎరువులను అరికట్టాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలనే తదితర డిమాండ్లతో జూన్ 3న మండల వ్యవసాయ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు.

3న సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(రూరల్): నగరంలోని సీఆర్ భవనంలో జూన్ 3న సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య రానున్నారని, కార్యవర్గ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

కల్తీ కల్లు తయారీదారులపై చర్యలు తీసుకోండి

కర్నూలు:వెల్దుర్తి మండలంలో కల్తీ కల్లు విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, దాడులు నిర్వహించి కల్తీ తయారీదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, వెల్దుర్తి మండల కార్యదర్శి టి.కృష్ణ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ మండల నాయకులు మాధవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎంసీహెచ్ కార్డుతో సురక్షిత ప్రసవం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు ఎంసీహెచ్ కార్డు ఇచ్చి, అందులో ఉన్న అంశాల వారీగా వైద్యచికిత్సలు, పరీక్షలు చేసినట్లయితే సురక్షిత ప్రసవం సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బి.తాండ్రపాడు, నన్నూరు పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో సంభవించిన మాతృమరణాలపై ఆయన సమీక్ష జరిపారు. ఈ మరణాలకు పల్మనరి ఎంబ్బలిజం, అధిక రక్తపోటు కారణాలని కమిటీ నిర్ధారించింది. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భిణులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లయితే మాతృమరణాలను తగ్గించవచ్చని కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రతి నెలా 9న ప్రతి ఆరోగ్య కేంద్రంలో జరిగే ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో గర్భిణులకు అన్ని చెకప్‌లు చేసి మాతాశిశు సంరక్షణ కార్డులో గుర్తించి, వారికి అవసరమైన వైద్యాన్ని అందించాలని, ఒకవేళ హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ప్రసవానికి మూడు రోజులు ముందుగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తే మరణాలు తగ్గించవచ్చని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువతి మృతి

కర్నూలు: స్థానిక పాతబస్తీకి చెందిన షేక్ సలీం బాషా దాడిలో తీవ్రంగా గాయపడిన షభానా(25).. 15 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకోలేక మంగళవారం మృతిచెందింది. ఒక టవ పట్ట ణ పోలీసులు తెలిపిన వివరాలు.. గడ్డా వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషాకు నలుగురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడో కుమార్తె ఫర్జానాను స్థానిక పాతబస్తీకి చెందిన షేక్ సలీం బాషాకు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశారు. ఆరు నెలల క్రితం వీరికి కూతురు జన్మించింది. అప్పటి నుంచి సలీం బాషా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. కూతురు తన సంతానం కాదంటూ తరచూ భార్యను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో తండ్రి మహబూబ్ బాషా కూతురు ఫర్జానాను పుట్టింటికి తీసుకెళ్లాడు. దీంతో సలీం బాషా తల్లి, తమ్ముళ్లతో కలసి అత్తగారింటికి వెళ్లి భార్యపై దాడి చేశారు. అడ్డొచ్చిన భార్య చెల్లెలు షభానాపై క్రికెట్ బ్యాట్‌తో కొట్టడంతో వెన్నుపూసలో తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. ష భానా తండ్రి ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమో దు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సమస్యల పరిష్కారానికే గడప గడపకు వస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ జయరాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. మురుగు కాలువలు, కల్వర్టులు, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరాగా.. ఎమ్మెల్యేస్పందించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, చిట్టెమ్మ, శ్వేతారెడ్డి, అరుణ, లక్ష్మికాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, అర్బన్‌వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు యూనస్ బాషా, కేవీ రమణారెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి

- ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఈఈ లక్ష్మీనారాయణ

కర్నూలు(అర్బన్): నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌తో ప్రశంసలు పొందుతామని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో డీఈఈ గోన నాగరాజుతో కలిసి ఆయన ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ శాఖకు విడుదలైన రివాల్వింగ్ ఫండ్ (ఆర్ఎఫ్) నిధులు రూ.2152.77 లక్షల్లో ఇప్పటి వరకు రూ.1753.87 లక్షలు ఖర్చు చేసి ఇతర ఇంజినీరింగ్ శాఖల కంటే పురోగతిలో ముందున్నామన్నారు. సమగ్రశిక్ష అధికారులు ఇచ్చిన ప్రోగ్రెస్ రిపోర్టులో పూర్తయిన అన్ని పనులను, సీపీఎం (సెంట్రల్ ప్రోక్యూర్‌మెంట్ మెటీరియల్)తో సంబంధం ఉన్న పనులన్నింటినీ కలిపి ప్రోగ్రెస్ రిపోర్టులో చూపడం వల్ల ఈనెల 29న జరిగిన సమీక్షల్లో జిల్లా కలెక్టర్ కొంత అసహనానికి గురయ్యారన్నారు. వాస్తవానికి తమకు అప్పగించిన పనుల్లో ఫిజికల్‌గా 81.47 శాతం నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశామన్నారు. వాస్తవానికి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్‌తో ఫిజికల్‌గా పూర్తి అయిన పనులకు ముడిపెట్టడం వల్ల తాము చేస్తున్న పనుల పురోగతి కనిపించలేదన్నారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో సంబంధిత ఏఈలతో సమీక్ష నిర్వహించి పొరపాట్లను సరిదిద్దామన్నారు. సమావేశంలో ఏఈలు మునీశ్వర్, రఘుమధుసూధన్‌రావు, వెంకట్రామిరెడ్డి, అజాజ్‌భాష, మహేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభను జయప్రదం చేయండి

కర్నూలు(లీగల్): కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జూన్ 2, 3, 4, 5 తేదీల్లో జరిగే భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) 11వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రంగనాథ్, జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, జిల్లా కోశాధికారి పి.దస్తగిరి మంగళవారం సంయుక్త ప్రకటనలో కోరారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, వెల్ఫేర్ ఫండ్ రూ.20 లక్షలు పెంచాలనే తదితర డిమాండ్లను సభలో చర్చించనున్నట్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని వారు కోరారు.

కల్యాణం కమనీయం

కర్నూలు కల్చరల్: స్థానిక కృష్ణానగర్ శ్రీనివాస మందిరం వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ అధ్యక్షులు పద్మనాభరెడ్డి, కమిటీ సభ్యులు చల్లా దామోదరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ మూర్తిగా వేంకటేశ్వర స్వామి వారు

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, అమర్ తదితరులు మంగళవారం డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఏ క్యాంపులోని ఓ స్కూల్ యాజమాన్యం విద్యాహక్కు చట్టం కింద సీటు పొందిన పిల్లలను చేర్పించుకోవడం లేదని, తక్షణమే విద్యాశాఖ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

హక్కుల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల

కర్నూలు (రూరల్): కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల సూచించారు. మంగళవారం నగరంలోని కేకే భవనంలో నిర్వహించిన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 లేబర్ కోడ్‌లను కుదించి 4 లేబర్ కోడ్లను చేయాలని చూస్తోందన్నారు. 53 ఏళ్లుగా కార్మిక, కర్షకుల కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకరప్ప, యేసు, వెంకటేశ్వర్లు, రాజు, మద్దిలేటి, బతుకన్న, నరసింహులు పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు త్వరగా ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం వివిధ వైద్య అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆమె కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చెప్పిన విధంగానే ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన రోగుల నుంచి ఏఎన్ఎంలు ఫీడ్ బ్యాక్ రిపోర్ట్ తీసుకోవడంలో 98 శాతం పురోగతి సాధించారని, రేపటిలోగా వంద శాతం పురోగతి సాధించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. మే 31 నాటికి నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ స్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పినప్పటికీ ఇంకా 76.98 శాతంతోనే ఉన్నారని, వారం రోజుల్లో 0.4 శాతం పురోగతి సాధించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చేవారం నాటికి 85 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. అలాగే నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ స్క్రీనింగ్, ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు సంబంధించి అనుమానిత కేసులైన వారిని పరీక్ష చేయడంలో వచ్చే వారం నాటికి ఏ మండలం కూడా 95 శాతం తక్కువ ఉండకూడదన్నారు. 10 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న అమ్మాయిలకు రక్తహీనతకు సంబంధించి నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో స్క్రీనింగ్ పరీక్షలు త్వరతగతిన పూర్తి చేయాలని సంబంధిత మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. వైఎస్‌ఆర్ కంటి వెలుగు కింద చేసిన సర్జరీలు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంట్రీ చేసే ప్రక్రియ త్వరిగగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.